క్లుప్తంగా

సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు భూమిపూజ



సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ అరీఫుల్లా బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరం 28వ డివిజన్‌లోని సాతుచెంగన్న వీధిలో రూ.25 లక్షల అంచనాతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు కార్పొరేటర్ అరీఫుల్లా బాషా ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో జిల్లా అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా కడపలో కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయన్నారు. సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ



ఆసుపత్రిలో పండ్లు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నరేన్ యువసేన, నరేన్ టీం ఆధ్వర్యంలో సీకేదిన్నె జడ్పీటీసీ సభ్యుడు పి.నరేన్ రామాంజులరెడ్డి జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు దాదాపు 180 మంది రక్తదానం చేశారు. అలాగే హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అనాథ బాలుర ఛాత్రాలయంలో చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి, వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు. పార్టీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ శ్రీరాం రమణ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

చింతకొమ్మదిన్నె : మండలంలోని మామిళ్లపల్లి దళితవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న హరినాథరెడ్డి ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎంఈఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈయన మృతదేహానికి రిటైర్డ్ డీఈఓ నాగమునిరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణప్రసాద్, రామానుజులరెడ్డి, సుబ్బారెడ్డిలు నివాళులర్పించారు.

ఘనంగా గౌరీదేవి నిమజ్జనం

మైదుకూరు : మైదుకూరులో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం గౌరీదేవి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాలలో ప్రతిష్ఠించిన గౌరీదేవికి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, నోములు, హోమాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిశాల నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి పట్టణ శివారులోని ఎర్ర చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మంలి అధ్యక్షురాలు మాలేపాటి పద్మజ, కార్యదర్శి భూపలం లత, ఉపాధ్యక్షులు యాదాళ్ల లక్ష్మీదేవి, కోట రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల అందజేత

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న యాచకులు, అనాథలకు వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. శనివారం అర్ధరాత్రి రామేశ్వరం, మైదుకూరు రోడ్డు, కొత్త బస్టాండు, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో తిరుగుతూ చలికి వణుకుతూ, దోమల వల్ల ఇబ్బందులు పడుతున్న యాచకులు, పేదలు, అనాథలకు వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి దుప్పట్లను అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వెంకట సురేష్, నరసింహా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఎర్రగుంట్ల : పట్టణంలోని ప్రకాశ్‌నగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో నివాసం ఉండే టీడీపీ, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండే రవిప్రకాశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డిల సమక్షంలో 40 కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యానారాయణరెడ్డి, కె.వి.సుబ్బారెడ్డి, మహబూబ్ వలి తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్‌పై కంఠస్థ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీనివాసనగర్‌లోని రేడియన్స్ హైస్కూల్‌లో ఆదివారం యునైటెడ్‌ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ ఆధ్వర్యంలో ఖురాన్‌పై కంఠస్థ పోటీలను నిర్వహించారు. 40 మంది విద్యార్థులు పాల్గొనగా నలుగురు విజేతలుగా నిలిచారని, వీరు విజయవాడలో జరిగే ఫైనల్ పోటీలో పాల్గొంటారని సంస్థ జిల్లా బాధ్యులు మొహిద్దీన్ తెలిపారు. పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వనాలకు వెళదాం.. భోజనం చేద్దాం

- ఐక్యత, ఆత్మీయత పెంచే వనభోజనాలు
- జిల్లాలో కార్తీక వన భోజనాలకు అనువైన ప్రాంతాలు



పుష్పగిరి



వేయి నూతుల కోన

కడప కల్చరల్ : వైష్ణవులకు శ్రావణమాసం ఎంత ముఖ్యమో, శైవులకు కార్తీకం అంతే ముఖ్యం. కార్తీకానికి మరో విశిష్టత కూడా ఉంది. ఈ మాసంలో వైష్ణవ ఆలయాలలో కూడా పూజలు, వ్రతాలు నిర్వహిస్తారు. కార్తీక మాసం పేరు వినగానే వన భోజనాల మాట గుర్తుకు వస్తుంది. మొన్నటి వరకు ఈ మాసంలో కార్తీక వన భోజనాలను ఎక్కువగా నిర్వహించే వారు. కానీ ఇటీవల కాలంలో ఎందుకో గానీ ఆ జోరు తగ్గింది. మళ్లీ ఇప్పుడు వన భోజనాల ప్రాముఖ్యతను గుర్తించిన ప్రజలు కుల సంఘాలు, కాలనీ వాసులు బృందాలుగా వన భోజనాలకు తరలి వెళుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఊరి బయట ఆరుబయళ్లలో, మామిడి తోటల్లో ఆనందంగా గడుపుతున్నారు. జిల్లాలో వన భోజనాలకు అనువైన కొన్ని ప్రాంతాల గురించి తెలుసుకుందాం.

పుష్పగిరి

శివకేశవుల ఆలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్న ఈ క్షేత్రం పెన్నానది ఒడ్డున ఉండడంతో కార్తీక మాసమంతా భక్తులతో కిటకిటలాడుతోంది. కడప నగరానికి సమీపంలో ఉండడంతో నగర వాసులు కూడా పెద్ద సంఖ్యలో ఈ క్షేత్రానికి వస్తారు. ఆలయం చుట్టుపక్కల విశాఖలమైన ప్రాంతాలు ఉండడంతో.. ఎక్కువగా కుల సంఘాలు, బ్రాహ్మణ సంఘాలు వన భోజనాలు నిర్వహిస్తుంటారు.

వేంపల్లె గండి

జిల్లాలోని వేంపల్లె గండి క్షేత్రంలో కూడా వన భోజనాలు ఎక్కువగా కార్తీక మాసమంతా నిర్వహిస్తుంటారు. నిజానికి ఇది వైష్ణవ క్షేత్రమే అయినా పాపాఘ్ని నది, విశాలమైన ఆరుబయలు, చుట్టూ కొండలు, ఆశ్రమాలు ఉండడంతో సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ మాసంలో కార్తీక వన భోజనాలను నిర్వహిస్తుంటారు.

కపర్థీశ్వరస్వామి కోన

సిద్దవటానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో లంకమల అభయారణ్యంలో కొండ కోనల మధ్య వెలిసిన కపర్థీశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారాలు భక్తులు కడప, బద్వేలు, అట్లూరు, సిద్దవటం ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి నోములు, పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం వన భోజన కార్యక్రమాలను చేపడతారు.

వేయి నూతుల కోన

కడప నగరం నుంచి పెండ్లిమర్రి వైపు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రం కొండల మధ్య కోనలో ఉంది. ఇక్కడి లక్ష్మీనరసింహాస్వామి కార్తీక మాసంలో భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించడం విశేషం. కోనేరు, భారీ వృక్షాలు, పిల్ల కాలువలు ఉండడంతో ఈ క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

సిద్దవటం కోట

సిద్దవటం కోట పెన్నానది తీరంలో ఉండడం, కోటలో పచ్చిక బయళ్లు ఉండడంతో సాధారణంగా కోటను చూసేవారే గాక కార్తీక సోమవారాల్లో ఈ నదిలో స్నానం చేసేందుకు కోటకు వస్తుంటారు. కార్తీక సోమవారాలలో సమీప ప్రాంతాల ప్రజలు వన భోజనాలకు ఈ కోటకే వస్తుంటారు.

తస్మాత్ జాగ్రత్త

జిల్లాలో నదీ ప్రాంతాలలోని పుణ్యక్షేత్రాల్లోనే ఎక్కువగా కార్తీక పూజలు, వనభోజనాలు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా పిల్లలు, యువకులు నదిలో నీళ్లను చూడగానే ఈత కొట్టాలని భావిస్తారు. ఈత రాకపోయినా నదుల్లో దిగుతారు. పుష్పగిరి, వాటర్ గండి, మాచుపల్లె, సిద్దవటం పెన్నానదిలో ఒడ్డువారగా కంటికి కనిపించని గోతులు ఉంటాయి. దిగిన వారు అందులో కూరుకుపోయి, బయట పడేందుకు అవకాశం ఉండదని అనుభవజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాలకు వెళ్లే భక్తులు, కుటుంబంలోని పెద్దలు గమనించాలని సూచిస్తున్నారు. విహారయాత్ర విషాద యాత్ర కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి



విద్యార్థులతో జిల్లా సేవాధికార సంస్థ సెక్రటరీ బాబా ఫ్రక్రుద్దీన్



బహుమతులు అందజేస్తున్న సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలని జిల్లా సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫ్రక్రుద్దీన్ పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కడప నగర శివారు రామాంజనేయపురంలోని హెలెన్ కెల్లర్ బధిరుల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ జనాభాలో నాలుగు నుంచి 8 శాతం మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారన్నారు. వీరి కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. వీటన్నింటిని విభిన్న ప్రతిభావంతులు వినియోగించుకోవాలని తెలిపారు. వికలాంగుల హక్కులచట్టం 2016, మానసిక హెల్త్‌కేర్ యాక్ట్ 2017 గురించి వివరించారు. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెమెంటోలతోపాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ నామినేషన్ మెంబర్స్, సీనియర్ న్యాయవాది జాలా ప్రభాకర్, హెలెన్ కెల్లర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ దౌలత్‌ఖాన్, ప్రిన్సిపాల్ మసుతాబేగం, ఉపాధ్యాయులు, విభిన్న ప్రతిభావంతులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు..

విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధే లక్ష్యం

కడప కార్పొరేషన్ : విభిన్న ప్రతిభావంతులను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మెప్మా సీఎంఎం టి.హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పోటీలలో పాల్గొన్న వారికి బహుతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టి.హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల వికలాంగులను పొదుపు సంఘాల్లో చేర్చి వారిని ఆర్థిక పరంగా బలోపేతం చేయడంలో మెప్మా కృషి చేస్తుందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల నైపుణ్య శిక్షణ ఇప్పించి, సంఘాల్లో సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. పీఎం స్వనిధి, జగనన్న తోడు ద్వారా వ్యాపార అభివృద్ధి కోసం రుణాలు ఇప్పిస్తున్నామని, విభిన్న ప్రతిభావంతులు వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఓలు, సీఎల్‌ఆర్‌పీలు, విభిన్న ప్రతిభా వంతులు పాల్గొన్నారు.

‘శ్రీకృష్ణతులాభారం’తో ముత్తరాజుకు కీర్తి



ప్రముఖ రంగస్థల నటుడు నాగమునిని సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్ : శ్రీకృష్ణ, సత్యభామల మధ్య ఎన్నో ఆసక్తికరమైన సన్నివేశాలతో రచించిన నాటకం ‘శ్రీకృష్ణతులాభారం’ రచయిత ముత్తరాజు సుబ్బారావుకు తరగని కీర్తిని ఆర్జించి పెట్టిందని ప్రముఖ రంగస్థల నటుడు నాగముని పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, శ్రీ వెంకటేశ్వర సాంస్కృతిక మండలితో కలిసి ఆదివారం ‘ముత్తరాజు సుబ్బారావు జీవితం –సాహిత్యం’ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ముత్తరాజు సుబ్బారావు స్వగ్రామం, జీవిత విశేషాలు, రచయితగా ఆయన సాధించిన విజయాల గురించి వివరించారు. ఆయన రచించిన పలు పౌరాణిక నాటకాలు విశేష ప్రజాదరణ పొందాయన్నారు. చారిత్రక నాటకాలను కూడా రాశారన్నారు. ‘శ్రీకృష్ణ తులాభారం’ నాటకం ప్రజల మనసుల్లో బాగా నాటుకుందని, అందువల్లనే ఆ కథను మూడుసార్లు సినిమాగా తీసినప్పటికీ సగానికి పైగా అందులోని పద్యాలను, పాటలను అలాగే ఉపయోగించుకోవడం విశేషమన్నారు. ఆ నాటకంతోపాటు ‘కచ దేవయాని’ అనే మరో పౌరాణిక నాటక విశిష్టతను విశ్లేషించారు. మరికొన్ని నాటకాల్లోని పాత్ర చిత్రణను, సంభాషణ చతురతను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త నాగమునిని బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎస్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఎం.మౌనిక, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, కొత్తపల్లె రామాంజనేయులు, ఎస్.నాగన్న తదితరులు పాల్గొన్నారు.

దత్తు మృతి యూటీఎఫ్‌కు తీరనిలోటు



దత్తు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకులు అక్షయ కుమార్ దత్ శనివారం రాత్రి అనారోగ్యంతో హైదరాబాదులోని యశోద హాస్పటల్‌లో మృతి చెందాడని, ఆయన మృతి యూటీఎఫ్‌కు తీరనిలోటని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం కడప యూటీఎఫ్ భవనలో దత్తు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి ఏపీ అమరావతి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి 2004లో ఉద్యోగ విరమణ పొందారన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా, రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్, చైర్మన్‌గా గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేశారన్నారు. అప్పటి నుంచి 2021 వరకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో పూర్తి కాలం కార్యకర్తగా స్వచ్ఛందంగా పనిచేశారన్నారు. 2012 సంవత్సరంలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు కడప జిల్లా ఇన్‌చార్జిగా ఉండి కడపతో ఎనలేని అనుబంధాన్ని కొనసాగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, జిల్లా కార్యదర్శులు రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు చంద్రశేఖర్, అనిల్‌కుమార్, దివాకర్, వెంకటసుబ్బయ్య, మహబూబ్‌బాషా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యాదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్నటువంటి క్లైయిమ్ వెంటనే విడుదల చేయాలన్నారు. మరో పక్క కరోనా వచ్చి భవన నిర్మాణ రంగం కుదేలై, కార్మికుల కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులను ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. 1996 చట్టాన్ని గౌరవించి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సంక్షేమ బోర్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు శ్రీరాములు, మస్తాన్, ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

భోజన కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని ఏపీ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 జూన్, ఆగస్టు నెలల పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలన్నారు. 20 ఏళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో వంట ఏజెన్సీలను నడుపుతున్నారని, కానీ వీరికి ఇప్పటికీ సరైన గుర్తింపు లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలకు పెంచాలని పేర్కొన్నారు. సబ్సిడీ కింద గ్యాస్‌ను ప్రభుత్వమే ఏజెన్సీలకు సరఫరా చేయాలన్నారు. నాడు–నేడు రెండో విడత కింద వంటశాలలు నిర్మించి వంట సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు సులోచన, లక్ష్మీ పార్వతి, వెంకటసుబ్బయ్య, అంజిరెడ్డి, గోపి, చెన్న కృష్ణారెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఇన్సాఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ముస్లింలపై వివక్ష చూపుతోందన్నారు. సెక్యులర్ వ్యవస్థకు తూట్లు పొడుస్తూ తినే తిండిపైన, కట్టుకునే బట్టపైన ఆంక్షలు విధిస్తూ కామన్ సివిల్ కోడ్ తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మోదీ స్వదేశీ విధానం పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని పెట్టుబడిదారులు ఆదాని, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా, నాయకులు ఎస్.గౌస్, హుస్సేన్, ఇస్మాయిల్, ఫైరోజ్, మస్తాన్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రొద్దుటూరు : పేద విద్యార్థులు చదువుకునేందుకు రెడ్ల సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లను అందించడం జరుగుతోందని ప్రొద్దుటూరు రెడ్ల సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి.నాగదస్తగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక పెన్నానది తీరాన ఉన్న రెడ్ల కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 53 మంది పేద విద్యార్థులకు రూ.4.60 లక్షలు స్కాలర్‌షిప్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైవీ రామమునిరెడ్డి, ఉపాధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ జి.రాజగోపాల్‌రెడ్డి, రిటైర్డు హెడ్మాస్టర్ వై.చెన్నారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయంలో కార్తీక వనభోజనాలు



వనభోజన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన కోలాటం

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగమేశ్వరాలయంలో ఆదివారం రెడ్ల వనబోజన సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెడ్ల వనభోజన సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ల వనబోజన సమితి ఆధ్వర్యంలో పది సంవత్సరాలుగా కార్తీక వనబోజన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందజేసిన ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి, కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాడు లాగుడు పోటీలు, కుర్చీలాట నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు.

నేడు పొలతలలో మల్లేశ్వరస్వామి కల్యాణం

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మూడవ కార్తీక సోమవారం సందర్భంగా సోమవారం ఉదయం 9.30 గంటలకు మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనువాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అనంతరం స్వామివారి ఊరేగింపు అక్కదేవతల గుడి వరకు నిర్వహిస్తామన్నారు.

పూర్వపు విద్యార్థుల సమ్మేళనం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక రమణప్ప సత్రంబడి ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1973–75 ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విభాగాలకు చెందిన పూర్వపు విద్యార్థులు అపూర్వ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకముందు పూర్వపు విద్యార్థులు వైఎస్ రవీంద్రనాథరెడ్డి, రామకృష్ణారెడ్డిలు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు అప్పటి అధ్యాపకులు బాలచంద్రారెడ్డి, కృష్ణమూర్తి, ఆర్.వెంకటనారాయణలకు పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, అప్పటి అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : మండలంలోని ఇందుకూరు గ్రామ సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఏపీకి జగన్ ఎందుకు కావాలి ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరంలోని రిమ్స్‌లో ఆదివారం బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అన్నదాన కార్యక్రమం నిర్వహించింది. నగరానికి చెందిన సుభాషిణి తన భర్త రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం బాసట ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దాదాపు 200 మంది రోగుల సహాయకులు, పేదలకు అన్నదానం చేశారు.

అవధాని ‘మాడుగుల’కు ఆహ్వానం

కడప కల్చరల్ : ప్రముఖ అవధాని, సాహితీవేత్త మాడగుల నాగఫణిశర్మను వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం మహాసభలకు హాజరు కావాలని సంస్థ ప్రతినిధులు ఆహ్వానించారు. ఆదివారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు ఆయనను కలిసి ఈనెల మూడవ వారంలో కడప నగరంలో జరగనున్న మహాసభలకు తప్పక హాజరు కావాలని కోరుతూ ఆహ్వానించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. స్పందించిన అవధాని మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా కవులు, రచయితలకు నిలయంగా ఉందని, ఉత్సవాలకు తప్పక హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

జూదరుల అరెస్టు

చింతకొమ్మదిన్నె : మండలంలోని మద్దిమడుగు గ్రామ సమీపంలో జూదమాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారినుంచి రూ.8,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రాజుపాళెంకు చేరిన అయోధ్య అక్షింతలు

రాజుపాళెం : అయోధ్య శ్రీరాముని వద్ద పూజించిన అక్షింతలను ఆదివారం సాయంత్రం రాజుపాళెంలోని కోదండ రామాలయం వద్దకు తీసుకు వచ్చారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శోభాయాత్ర పెద్ద సంఖ్యలో భజన సంకీర్తనలు, కోలాటాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. రామ మందిరం జనవరిలో ప్రారంభోత్సవం జరుగుతున్నందున అక్కడ నుంచి అన్ని గ్రామాలకు అక్షింతలను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు నాగార్జున రావు మాట్లాడుతూ రామాలయంలో ఉంచిన తార్వాత మండలంలో ప్రతి ఇంటింటికీ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘటన కార్యదర్శి మల్లికార్జున రావు, బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి, శ్రీరాములు, సేవకులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

టీటీడీ ధర్మ ప్రచారం భక్తుల కోసమే

పోరుమామిళ్ల : తిరుమల తిరుపతి దేవస్థానములు భక్తుల కోసం నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు వినియోగించుకుని ధర్మమార్గం, భక్తి మార్గం వైపు నడవాలని టీటీడీ కడప జిల్లా నిర్వాహకులు గోపిబాబు, ధర్మప్రచార మండలి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో 5 రోజులుగా పోరుమామిళ్ల వీరాంజనేయస్వామి దేవస్థానంలో తుపాకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు పరిశీలించేందుకు వారు ఆదివారం ఇక్కడకు వచ్చారు. గత 5 రోజులుగా నిర్వహించిన రామాయణ, భారత, భగవద్గీత ప్రవచనాలు ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు దోహదపడతాయన్నారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు ఘన నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు ఒబుళరెడ్డి, మునయ్య, అధ్యాపకుడు సురేంద్రారెడ్డి, సాయికుమార్, సుబ్రహ్మణ్యం, రమణయ్య భాగవతార్ తదితరులు పాల్గొన్నారు.